క్లుప్తంగా

విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడమనూరు : మండలంలోని ఎర్రబెల్లి 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శరత్‌కుమార్ తెలిపారు. ఎర్రబెల్లి 133/ 33 కేవీ పరిధిలోని పులిమామిడి, ముప్పారం, తుమ్మడం, గుంటిపల్లి, కన్నెకల్, కామారెడ్డిగూడెం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, ఎర్రబెల్లి 133/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులతో త్రిపురారం పరిధిలోని కామారెడ్డిగూడెం సబ్‌స్టేసన్ పరిధిలోని గ్రామాలు, పులిమామిడి సబ్‌స్టేషన్ పరిధిలోని అనుముల మండలంలోని పలు గ్రామాలు, కన్నెకల్ సబ్‌స్టేషన్ పరిధిలోని మాడ్గులపల్లి మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో కుట్టు, కరాటే, డ్రాయింగ్ శిక్షణ



హెచ్‌ఎంకు కుట్టుమిషన్లు అందజేస్తున్న బాలభవన్ సూపరింటెండెంట్, తదితరులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పైలాన్‌కాలనీలోని ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో కుట్టు శిక్షణతో పాటు డ్రాయింగ్, ఆత్మరక్షణకు కరాటేను ఉచితంగా నేర్పిస్తున్నట్లుగా ఆ పాఠశాల హెచ్‌ఎం శేషు తెలిపారు. బుధవారం నాగార్జునసాగర్‌కు చెందిన జిల్లా బాలభవన్ సూపరింటెండెంట్ బాలు సిబ్బంది మధుసూదన్, జహంగీర్‌లు రెండు కుట్టుమిషన్లను పాఠశాలకు అందజేశారు. బాలభవన్‌ను నుంచే విద్యార్థినులకు కుట్టుశిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు నృత్యం, కంప్యూటర్ కోర్సులు నేర్పించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రాజబాబు, లాలు, అంజయ్య పాల్గొన్నారు.

భిక్షం కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు : మండలంలోని బుంటువారిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త, మాజీ సర్పంచ్ గుండెబోయిన భిక్షం తండ్రి వెంకటయ్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, మాజీ సర్పంచ్ గుండెబోయిన రాంబాబు, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ మెరుగు రామలింగయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల రమేష్, జీడయ్య, బాలయ్య ఉన్నారు.

విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అనుముల మండల ఎంఈఓ కృష్ణమూర్తి అన్నారు. అనుముల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆపాఠశాల పూర్వ విద్యార్థి కళ్యాణి బుక్‌స్టాల్ రాము సహకారంతో స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులను ఎంఈఓ కృష్ణమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు నిర్మలదేవి, సృజన, మధుసూదన్, విజయలక్ష్మి, యశోద, మమత తదితరులు ఉన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో..

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఎస్‌బీఐ బ్యాంక్ వారు సహకారం అందించడం అభినందనీయమని త్రిపురారం ఎంఈఓ రవినాయక్ అన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని రూప్లాతండా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ బ్యాంక్ ఆర్థిక సహకారంతో రూ.10వేలు విలువ చేసే నోట్‌బుక్‌లు, పెన్నులు, స్టడీ మెటీరియల్‌లను బ్యాంక్ మేనేజర్ రాజుతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రవి, రమణమ్మ, శ్రీనివాస్, అరుణ, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సునీల్, సీఆర్పీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ రవినాయక్

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



కంకరతేలి అధ్వానంగా ఉన్న చక్కోలం - పిల్లిగుండ్లతండా రోడ్డు



గుంతలమయంగా మారిన నేతాపురం- డొక్కలబావితండా రోడ్డు

తిరుమలగిరి : మండలంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా మరమ్మతులకు గురై అధ్వానంగా మారాయి. ప్రతినిత్యం ఆయా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు ఈ రహదారుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుకో గుంత.. తీరేనా మా ఈ చింత అన్న చందంగా ఉన్నాయి. మండలంలోని డొక్కలబావితండా- నేతాపురం రోడ్డు మరమ్మతులకు గురైంది. మిర్యాలగూడ పట్టణంతో పాటు, నిడమనూరు మండలంలోని కోటమైసమ్మ, దామరచర్ల మండలంలో బంగారు మైసమ్మ ఆలయాలకు వెళ్లాలంటే ఈ దారిగుండానే ప్రయాణించాల్సి ఉంటుంది. డొక్కలబావితండా, రాజవరం, బోయగూడెం, గర్కనట్‌తండా, జెవ్విచెట్టుతండా, తునికినూతల, కిచ్చతండా, నాయకునితండా, తిమ్మయ్యపాలెంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు మిర్యాలగూడ వెళ్లాలంటే ఈ రహదారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. ఈ రహదారి పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో తిరుమలగిరి మండల కేంద్రం మీదుగా హాలియా నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్డు దెబ్బతినడంతో ఈ దారి గుండా ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయకట్టు గ్రామాల ప్రజలు ఈ దారి గుండానే ఆటోల్లో పరిమితికి మంచి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ఏర్పడుతుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. రాత్రివేళ ఈ దారిగుండా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా లేకపోలేదు.

యల్లాపురంతండా- పిల్లిగుండ్లతండాది అదే పరిస్థితి..

మండలంలోని యల్లాపురంతండా నుంచి పిల్లిగుండ్లతండాకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని కంకరతేలి ఉంది. చింతలపాలెం, గోడుమడక, నెల్లికల్లు, ఎర్రచెరువుతండా, జాల్‌తండా, బట్టువెంకన్నబావితండా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఈ దారి గుండానే రావాలి. దీంతో పాటు నాగార్జునసాగర్‌కు వెళ్లేవారు కూడా ఈ దారిగుండానే వెళ్తారు. అలాగే కొంపల్లి నుంచి సుంకిశాలతండాకు వెళ్లే రహదారి కూడా పూర్తిగా కంకరతేలి ప్రమాదకరంగా మారింది. కంకరతేలి ప్రమాదకరంగా మారి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



డొక్కలబావితండా, నేతాపురం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. అడుగుకో గుంత ఏర్పడడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నాం. మిర్యాలగూడకు వెళ్లాలంటే ఈ దారి మాకు చాలా దగ్గరగా ఉంటుంది. వర్షాలు వచ్చినప్పుడు గుంతల్లో నీరు చేరి గుంతలు కనపడకుండా ఉంటున్నాయి. దీంతో ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నాం.

– గడ్డమీది నాగార్జున్, రాజవరం

ప్రమాదాల బారిన పడుతున్నాం



యల్లాపురంతండా, పిల్లిగుండ్లతండా రోడ్డు గుంతలమయంగా మారి కంకరతేలి ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా పరిస్థితి ఇలాగే ఉన్న పట్టించుకునే నాధుడు లేడు. నాగార్జునసాగర్‌కు వెళ్లాలన్నా, మండల కేంద్రానికి రావాలన్నా ఈ దారి నుంచే రావాలి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి, ప్రమాదాలను నివారించాలి.

– కుర్ర నాగేశ్వరావునాయక్, చక్కోలంతండా

ముకుందాపురం ప్రభుత్వ పాఠశాల పరిశీలన



ముకుందాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠాలు చెబుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిడమనూరు : మండలంలోని ముకుందాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆమె ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మంచిగా చదవాలంటూ విద్యార్థులకు సూచించి చాక్లెట్లు అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థుల వివరాలను హెచ్‌ఎం నాగజ్యోతిని అడిగి తెలుసుకున్నారు. మొత్తం 68 మంది విద్యార్థులు ఉన్నారని హెచ్‌ఎం వివరించారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. హెచ్‌ఎం నాగజ్యోతి మా పాఠశాలకు జూలై, ఆగస్టు నెలలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, గురుకులాలకు, హాస్టళ్లలో ఉండలేని విద్యార్థులు మా పాఠశాలలో చెరుతారని వివరించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఈఓ భిక్షపతి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఎంఈఓ ఎల్.వెంకన్న, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఆర్‌ఐ సందీప్ తదితరులు ఉన్నారు.

వరిసాగుపై రైతులకు అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

హాలియా : నేరుగా విత్తే వరిసాగుతో రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మహేంద్రకుమార్, డాక్టర్ సురేఖ, డాక్టర్ బ్రజేంద్ర అన్నారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో జిల్లాలలోని రైతులకు నేరుగా వరి విత్తడం వల్ల కలిగే ఉపయోగాలు, పద్ధతులపై భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేరుగా వరి విత్తడానికి అనువైన వరి వంగడాలు, కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యంపై వివరించారు. ఈ పద్ధతితో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకొని నేలను పరిరక్షించుకోవచ్చన్నారు. మృతిక పరీక్షల కిట్ వల్ల కలిగే ఉపయోగాలపై అవాహన కల్పించి పలువురు రైతులకు మృతిక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, కవిరాజ్, సుష్మ, అజయ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మిర్యాలగూడ : పీహెచ్‌సీ వైద్యుడికి సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, ఆశాలు

మిర్యాలగూడ : జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని దామరచర్ల సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడికి ఆశాలతో కలిసి ఆయన సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరిస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, ఆశాలు జయమ్మ, సుజాత, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేత

మిర్యాలగూడ టౌన్ : జూలై 9న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొంటున్నట్లు బుధవారం హౌజింగ్‌బోర్డులో గల మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ రేఖల మమతకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతమ్ రెడ్డి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బొంధు పార్వతి మాట్లాడారు. కార్మిక సంఘాలు అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, ఆ చీకటి కార్మిక సంఘాలను తక్షణమే రద్దు చేసి 29 కార్మిక చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను రెగ్యులరైజ్ చేయాలని, హెల్పర్లకు రూ.26వేలు, టీచర్లకు రూ.32వేల వరకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ టీచర్లు, హెల్పర్లకు రూ.9వేల వరకు పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ బలోపేతానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, పౌష్టికాహారం పరిమాణాన్ని, నాణ్యతను పెంచాలని, సరైన మౌలిక వసతులను కల్పించాలని కోరారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు రహిదా, గాయం ప్రమీల, ఇంద్రపల్లి సైదమ్మ, డివిజన్ కార్యదర్శి తూడి అరుణ, ప్రమీల తదితరులున్నారు.



మిర్యాలగూడ టౌన్ : ఐసీడీఎస్ సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

రెండో అదనపు న్యాయమూర్తిగా అరుణ్‌తేజ్ బాధ్యతల స్వీకరణ



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రెండో అదనపు న్యాయమూర్తిగా వి.అరుణ్‌తేజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి అరుణ్ తేజ్ మాట్లాడారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తి సమన్వయంతో పనిచేస్తేనే కక్షిదారులకు సత్వరన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ : అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం డిండి పోలీసులు పట్టుకున్నారు. డిండి ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల పరిధిలోని గోనకల్ గ్రామసమీపంలో అనుమతులు లేకుండా 2ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చి సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకొని ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అడ్మిషన్లలో పాఠశాల ఆదర్శం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల అడ్మిషన్లలో ఆదర్శమని డీఈఓ భిక్షపతి అన్నారు. బుధవారం పాఠశాలను సందర్శించి అడ్మిషన్లు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న తరుణంలో నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేశారన్నారు.

సన్న బియ్యంలో కల్తీని నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవినాయక్

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా పేదలకు ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యంలో కల్తీ జరుగుతుందని టీఆర్‌జీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరానికి రూ.13వేల కోట్లతో రేషన్‌షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం ఇస్తున్నామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వం అమలులో మాత్రం నాసిరకంగా పంపిణీ చేస్తుందన్నారు. పేదలకు అందిస్తున్న కల్తీ బియ్యంతో పేదలు తినలేకపోతున్నారని, దీంతో ప్రజలు బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలన్నారు. లేకుంటే అన్ని జిల్లాల సివిల్ సప్లయ్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ధీరావత్ శ్రీనునాయక్, ధనావత్ శ్రీనునాయక్, చిట్టిబాబు, నాగునాయక్, రవీందర్, అనిల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా ప్రకటించాలని వినతి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిడమనూరు : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. నిడమనూరు, సూరేపల్లి, వల్లభాపురం, ఎర్రబెల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల జాబితా అధికారుల జాప్యంతో ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల జాబితా జిల్లా అధికారులు ఆమోదం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని నిడమనూరు, సూరేపల్లి, వల్లభాపురం, ఎర్రబెల్లి గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులైన వారి లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల కమిటీ సభ్యుడు కుంచెం శేఖర్, వింజమూరి శివ, ముత్యాల కేశవులు, కొండేటి సైదులు తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 12 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) 2024-2025 ఫలితాలలో కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రమావత్ నాగేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన సోని షేక్, మండలి ఇందు, సునంద, లక్ష్మి, శివ, దుర్గప్రసాద్, తిరుపతి, నిత్యలక్ష్మి, వినోద్, పూజ, ప్రవీణ్ చంటి ఎంపికయ్యారు. వారికి ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించనుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, సైదానాయక్, బాలాజీనాయక్, సువర్ణ, ఆనంద, సుధాకర్, శ్రీధర్, గీతాంజలి, ప్రభావతి, నాగార్జున, శ్రీనివాస్, అంజయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శన



పంచముఖ బుద్ధుల వద్ద బీజేపీ రాష్ట్ర వ్యవహారాల సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారీ

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్, బుద్ధవనాన్ని బుధవారం పలువురు సందర్శించారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ (సంఘటన మంత్రి) చంద్రశేఖర్ తివారీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డిలతో కలిసి బుద్ధవనాన్ని సందర్శించారు. ముందుగా బుద్ధుడి పాదులకల వద్ద పూజలు చేశారు. అనంతరం మహాస్థూపంలోని పంచముఖ బుద్ధులను సందర్శించారు. అదే విధంగా మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుద్ధవనాన్ని, సాగర్‌డ్యాంను సందర్శించారు. వారితో పాటు ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగానికి చెందిన విద్యార్థులు ప్రొఫెసర్ లావణ్య ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంతో పాటు నాగార్జునకొండను సందర్శించారు. వారికి గైడ్ సత్యనారాయణ బుద్ధవనం చరిత్రను వివరించారు.

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

దేవరకొండ : ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేందుకు స్థల పరిశీలన చేయాలని తహసీల్దార్లకు సూచించారు. అనంతరం రేషన్ కార్డులు, ఎలక్షన్ క్లెయిమ్స్ వంటి అంశాలపై సమీక్షించారు. సమావేశంలో డివిజన్ పరిధిలో గల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి 'యాంటీ డ్రగ్ సోల్జర్'గా మారాలి



మాట్లాడుతున్న నాంపల్లి సీఐ రాజు

దేవరకొండ : డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారాలని నాంపల్లి సర్కిల్ సీఐ రాజు అన్నారు. బుధవారం చింతపల్లి మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు, చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రామూర్తి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, ఉత్తమ ప్రతిభతో గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు విద్యార్థులు భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారి డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ మోసాలకు గురి అయితే సైబర్ క్రైమ్ డయల్ 1930 ఉమెన్ హెల్ప్‌లైన్ 1091, 181, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098/112 డయల్ 100 వంటి సేవల కోసం వేర్వేరు నంబర్లను ప్రజలు ఉపయోగించే వారు వాటి స్థానంలో ఒకటే నంబర్ 112 కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌కు ఎదురుచూపులు

- డీడీలు తీసి ఏడాది అవుతున్నా మంజూరు కాని ట్రాన్స్‌ఫార్మర్లు
- సీరియల్ అంటూ, వర్కర్ ఆర్డర్ రాలేదంటూ నాన్చుడు ధోరణి
- వానాకాలం సీజన్ మొదలైనా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు



రైతులే ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె, స్తంభాలు పాతుకొని ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఎదురుచూస్తున్న రైతులు

నిడమనూరు : ఈ ఏడాది ముందస్తు వర్షాలతో మురిపించినా.. అ తర్వాత వర్షాలు ముఖం చాటేసాయి. దీంతో సాగుకోసం రైతులు ప్రత్యామ్నాయ మార్గాలవైపు వెళ్లాల్సి వస్తోంది. సాగునీటికోసం బోరు మోటార్లు, ఇతర నీటి వనరులపై ఆధారపడుతున్నారు. దీంతో సాగర్ ఆయకట్టు రైతులు పలువురు విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం చాలా రోజులనుంచి ఎదురు చూస్తున్నారు. విద్యుత్ సరఫరా కోసం అవసరమైన డీడీలు తీసి కార్యాలయాల్లో అప్పగించి ఏడాది గడిచినా విద్యుత్ కనెక్షను ఇవ్వడం లేదు. వానాకాలం సీజన్‌కు ముందే స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కనెక్షను ఇవ్వాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

40శాతం విద్యుత్ కనెక్షన్లు..

మండలంలో సాగర్ ఆయకట్టు పరిధిలో 16గ్రామాల్లో 16,500 ఎకరాల వరకు వరి సాగవుతోంది. సాగునీటికోసం పూర్తిగా సాగర్ నీటిపైన ఆధారపడి సాగు చేయాల్సి ఉంటుంది. ప్రతి వర్షాకాలం అటూ ఇటూ అవుతుంటే రైతులు విద్యుత్ కనెక్షన్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికై 40శాతం వరకు రైతులు విద్యుత్ కనెక్షన్లు పొందారు. వాటికి కూడా ప్రతిచోట ట్రాన్స్‌ఫార్మర్, లైన్లు, కండక్టర్ సమస్యలు ఉన్నాయి. సాగుకు సన్నద్ధం కావాలంటే కరెంటు కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సిందే, ఇది పాత విద్యుత్ కనెక్షన్లు ఉన్న రైతుల పరిస్థితి, కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల తీరు ఒకలా ఉంటే కాంట్రాక్టర్లు పైసలు ఇవ్వనిదే పనులు ప్రారంభించని పరిస్థితి.

ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.20వేల నుంచి రూ.30వేలు అదనం..

వ్యవసాయ అవసరాల ఆధారంగా రైతులు 2నుంచి 4, 5బోర్లకు విద్యుత్ కనెక్షన్‌పై ఆధారపడాల్సి వస్తోంది. ఒక్కో 5హెచ్‌పీ మోటారు కోసం రైతులు రూ.4590ల డీడీ తీసి, అనంతరం లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌తో కనెక్షన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఏఈ ఇస్తే అతను ఏడీ పంపితే.. విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తారు. ఇలా నలుగురు ఐదుగురు రైతులకు కలిపి 25హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్, మెటీరియల్ పంపిణీ చేస్తుంటారు. అధికారులు పంపిణీ చేసే మెటీరియల్ అంతా కాంట్రాక్టర్ ఇస్తారు. ఆ కాంట్రాక్టర్ మెటీరియల్ అంతా రాలేదు. అంటూ ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రైతులను రూ.20వేల నుంచి రూ.30వేలు అదనంగా పైసలు డిమాండ్ చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే మీ సీరియల్ రాలేదు. మీ కంటే ముందు చాలా మంది రైతులు ఉన్నారంటూ అధికారులు రోజుల తరబడి తిప్పుతున్నారు. అదే కాంట్రాక్టర్‌కు మన వివరాలు చెప్పి రూ. 20వేలు అదనంగా ఇస్తే 10నుంచి 15రోజుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో రైతులు విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కాంట్రాక్టర్ నిర్మించాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు, విద్యుత్ స్తంభాలు రైతులే నాటుకొని సిద్ధంగా ఉంచినా అధికారులు, కాంట్రాక్టర్లు రైతులతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ట్రాన్స్‌ఫార్మర్ బిగించడంలో జాప్యం చేస్తున్నారు.

సీరియల్ వారీగా విద్యుత్ కనెక్షన్లు

మండలంలో రైతుల నుంచి వచ్చే డీడీలు మా దగ్గరకు వచ్చినవి ఎప్పటికప్పుడు ఏడీ హాలియా కార్యాలయానికి పంపుతున్నాము. సాంకేతిక సమస్యలు తప్పా, అందులో జాప్యం చేయడం లేదు. సీరియల్ వారీగా రైతులకు విద్యుత్ కనెక్షన్లు విడుదల చేస్తున్నాం.

– శరత్‌కుమార్, నిడమనూరు విద్యుత్ ఏఈ